# జ్ఞాపకాల జావళీలు- దీపావళి

మా ఇంట్లో దీపావళి సంరంభం ఓ నెల్నాళ్ళు ముందు నుండే ప్రారంభం అయ్యేది. అసలు వేసవికాలం సెలవులలో ఖాళీ అయిపోయిన ధనాగారాన్ని (దాన్నే ముద్దుగా కిడ్డీబ్యాంక్ అనేవారు) మళ్ళీ నింపటానికి మా అన్నయ్యకు దొరికిన సాకు దీపావళి. రంగయ్య కొట్టులో అరటిపళ్ళు కొబ్బరికాయలు తెమ్మని అమ్మ ఇచ్చిన డబ్బులలో, హారతి కర్పూరం తెమ్మని నాయనమ్మ ఇచ్చిన డబ్బులలో దర్జాగా వాటా తీసేసుకుని ఎవరైనా అడిగితే దీపావళి చందా అని ఠీవీగా చెప్పేవాడు. దీపావళి దగ్గరయ్యేకొద్దీ ఏ బాణాసంచా కొనాలి, మా కాలనీ దద్దరిల్లేట్టు ఢమఢమాలు ఎలా కాల్చాలి వగైరా గంభీరమైన విషయాలన్నీ తన మిత్రబృందం తో సమావేశమై చర్చలు జరిపేవాడు. కొన్నాళ్ళు మా ఇంటి వెనకాల "శివకాశి" లెవెల్లో ఓ చిన్న సైజు టపాకాయల కర్మాగారం (హేండిక్రాఫ్ట్స్ మరి) పెట్టాలన్న బ్రిలియంట్ ఐడియా వారికి రాకపోలేదు. కాకపోతే ఆ ఆలోచన మొగ్గ తొడిగే లోపే మా నాన్నగారు నిర్దాక్షిణ్యంగా తుంచేశారు. అది వేరే సంగతి. పండగకు రెండు మూడు రోజుల ముందు మా నాన్నగారు తను కొన్న బాణాసంచా మా ముగ్గురికీ పంచేవారు. చిచ్చుబుడ్లు, కాకరపువ్వొత్తులు, మతాబాలు, భూచక్రాలు, వెన్నముద్దలు, చాంతాళ్ళు, విష్ణుచక్రాలు, సీమ టపాకాయలు, లక్ష్మీ ఔట్లు, రాకెట్లు ఇంకా రక రకాల ఢమరుకలు వగైరాలన్నీ మూడు చాటలలో సర్ది ఎండలో ఉంచేవాళ్ళం. మందులు ఎండినంతసేపూ మా వాటా లోంచి ఏమన్నా వస్తుమార్పిడి మా అన్నయ్య వాటా లోకి "ఎవరి" ప్రమేయం లేకుండా జరిగిందేమో నని మా సోదరీమణులం దీర్ఘంగా ఆలోచించటంతోనే సగం రోజు అయిపోయేది. అంతేకాకుండా మా చుట్టుపక్కల ఉన్న పల్లెల నుంచి సైకిలు వెనకాలే వేళ్ళాడే తట్టాలో కట్టలుగా కట్టిన తాటాకు టపాకాయలు అమ్ముతూ ఒకతను ప్రతి సంవత్సరం వచ్చేవాడు. ఎక్కడో మద్రాసులో తయారు చేసిన మందులు కొని మన ఊరి పక్కన తయారు చేసిన మందులు కొనకపోతే ఎలా అని చాలా ఫీలయ్యి మరీ కొనేవాళ్ళం. మిగతా మందులు కాల్చటానికి దీపావళి వరకూ ఆగేవారం కానీ తాటాకు టపాకాయలు, సీమటపాకాయలు మాత్రం రోజు స్కూల్ నుంచి రాగానే స్కూల్ బ్యాగు విసిరేసి అదే వేగంతో పెరట్లోకి పరిగెట్టి తాటాకు టపాకాయ ను ఒక వైపు మడిచి చేతిలో పట్టుకుని మరో చేతిలో వెలిగించిన ఊదుకడ్డీ ధరించి, టపాకాయ వత్తి వెలిగించి వెలిగీ వెలగగానే దూరంగా పడేట్టు రివ్వున పైకి విసిరేవాళ్ళం. టపాకాయ నేలకు తాకకముందే గాలిలో పేలేటట్లు విసరటం మా గోల్. అలాగ ఎన్ని కాల్చినా (కారప్పూస తిన్నట్లు) విసుగు వచ్చేదికాదు. నిజంచెప్పాలంటే అప్పుడు మా రామదండు మొత్తం లో అలా టపాకాయల్ని చేతిలో కాల్చిన (అంటే ఓ పొడవాటి న్యూస్ పేపరు కి ఓ చివర టపాకాయ పెట్టి మరో చివర ఊదుకడ్డీతో ఆమడ దూరం నుంచి వంగి నిప్పు అంటించడాం కాదన్నమాట) అమ్మాయిని నాకు గుర్తున్నంతవరకూ నేనే. ఇలాగా ఎలాగో అతి భారంగా రోజులు గడిచాక మొత్తానికి నరకచతుర్దశి రోజు వచ్చేసేది. ఆ రోజు ఉదయాన్నే హడావుడిగా లేచేసి బాణాసంచా కాల్చేవాళ్ళం. నరకాసురుడిని సత్యభామ చంపిన రోజు కాబట్టి ఆ రోజు మన సంతోషానికి సూచనగా మందులు తప్పకుండ కాల్చాలని మా నాయనమ్మ గారి ఉవాచ. ఆవిడ రోజు మధ్యాహ్నం పోతన భాగవతం కొంత చదువుకునేవారు. ఒక్కోసారి ఆవిడకు భాగవతం పూర్తి చేయటానికి నెలలు పట్టేది. ఆ తర్వాత భారతమో, రామాయణమో మొదలు పెట్టేవారు. అలా రోజు, మధ్యాహ్నం సాయంత్రపుటెండలో కరిగిపోయేవేళ, తన వ్యాసపీఠం ముందు కూర్చుని పుస్తకాన్ని కళ్ళకద్దుకుని ఆవిడ రోజు గొంతెత్తి చదువుకుంటూ ఉండేవారు. చుట్టూ ఆడుకుంటూ మేము, వంట చేస్తూ మా అమ్మగారు, మొక్కలకు నీళ్ళు పోస్తూ మా నాన్నగారు ఓ చెవి అసంకల్పితంగా అటు పడేసి ఉంచేవాళ్ళం. యుద్ధం చేస్తున్న సత్యభామని వర్ణిస్తూ పోతనగారు భాగవతం లో వ్రాసిన పద్యాలు ఆవిడ ఒక సందర్భం లో చదువుకోవటం నాకు ఇప్పటికీ గుర్తు .

దీపావళి రోజు సాయంత్రం మట్టి ప్రమిదెలలో నువ్వుల నూనే, వత్తులు వేసి వెలిగించి మా అమ్మగారు ఇంటిచుట్టూతా, వరండా లో మెట్లమీద, కిటికీ అంచుల మీద, తులసిచెట్టు చుట్టూ దీపాల్ని అందంగా అమర్చే వారు. నా దీపావళి జ్ఞాపకాలలోకెల్లా అందమైన జ్ఞాపకం అది. చాలా సాదాసీదాగా ఇటుక రంగులో ఉండే ఆ జోడు ప్రమిదెలు ఎంత అందంగా ఉండేవో! ఇప్పుడు అందమైన కొవ్వొత్తుల తో ఎన్నో రంగులలో, రకరాల ఆకారాల్లో ప్రమిదలు వస్తున్నా ఆ మట్టి ప్రమిదలలో ఉన్న సరళమైన, ప్రశాంతమైన అందం వాటికి లేదేమో నని అనిపిస్తుంది. నిజానికి నా అసోసియేషన్స్ వాటితో ముడిపడటం బహూశా నాకు అవి అంతగా నచ్చటానికి ఒక కారణం కావచ్చు.

నా దీపావళి జ్ఞాపకాలలో మరో అందమైన జ్ఞాపకం "పూలపొట్లాలు". ఒక సంవత్సరం ఎవరో మాకు పల్లెలలో తయారుచేసిన "పూలపొట్లం" తెచ్చారు. అది ఎలా చేస్తారో తెలీదు కానీ అది నిజంగా పూలపొట్లమే. అంత లలితంగా, సుకుమారంగా, మెత్తని పూలరెక్కల్లా రాలే నిప్పురవ్వల్ని నేనెప్పుడూ చూడలేదు. మేము కొనుక్కున్న బాణాసంచా వదిలేసి ఆ పూలపొట్లాన్ని తిప్పటానికి పిల్లలందరం పోటీపడటం నాకు ఇంకా గుర్తే. అది మీద పడకుండా వర్తులాకారంలో చుట్టూ ఎలా తిప్పాలో తెచ్చినాయన చూపిస్తేకానీ తెలియలేదు. మొదట్లో కాస్త తడబడ్డా అలవాటైనాక పుప్పొడి రేణువులో, పూరేకులో, నక్షత్రాలో అన్నట్లు రాలే నిప్పురవ్వల జ్యోతిర్వలయంలో నిలబడటం ఓ అపూర్వమైన అనుభవం.

దీపాలు పెట్టగానే మా చెల్లి కుదురుగా ఓ పక్కన తన వెన్న ముద్దలు, కాకర పువ్వొత్తులు, చాంతాళ్ళు, మతాబాలు, పాముబిళ్ళలు కాలిస్తె మరో పక్క మా అన్నయ్య లక్ష్మి ఔట్లు, సీమటపాకాయలు, రాకెట్లు, ఢమఢమాలు కాల్చేవాడు. నాలాంటి బైపార్టిసన్లు కాసేపు అక్కడ కాసేపు ఇక్కడ కాలక్షేపం చేసేవాళ్ళం. అన్నట్లు నాకు చాలా ఇష్టమైన వాటిల్లో విష్ణుచక్రాలు, చిచ్చుబుడ్లు మొదటివి. ముఖ్యంగా విష్ణుచక్రాలు గిరగిరా తిరుగుతున్నపుడు చెయ్యి కాలకుండా ఉండటానికీ, అవి కింద పడేయకుండా ఉండటానికీ చేసే భరత నాట్యవిన్యాసం ఇంకా గుర్తే. ఈ చిచ్చుబుడ్లు వెలిగించినప్పుడల్లా విరగ పూచిన నక్షత్రాల చెట్లని కొన్ని క్షణాలపాటు ఇంటి ముంగిట్లో నాటినట్లు ఉండేది. అలా అలిసిపోయేంతవరకు దీపావళి మందులు కాల్చి, మందులు అయిపోయాక మిగిలిన మందులు చెత్తకాగితాలు అన్నీ వేసి ఓ బోనఫైర్ వేసేవాళ్ళం. అది చల్లారాక నిద్రకళ్ళతో ఇంట్లోకి వెళ్ళేవాళ్ళం. అయినా నాగులచవితి వరకూ అడపా దడపా టపాకాయల శబ్దాలు వినబడుతూనే ఉండేవి. చదువరులకు దీపావళి శుభాకాంక్షలు!!!!! --**వెన్నెల**